# లేటెంటు హీటూ-థర్మామీటరూ

**'వసుంధర'**

"నీటిని వేడిచేస్తే ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఆ ఉష్ణోగ్రతను థర్మామీటరుతో కొలవ్వచ్చు. మామూలుగా నీటి ఉష్ణోగ్రత ముప్పై డిగ్రీల ప్రాంతంలో వుంటుంది. వేడిచేయడం మొదలుపెట్టాక క్రమంగా పెరుగుతూవచ్చి—నీరు మరగడం ప్రారంభించేసరికి వంద డిగ్రీలవుతుంది. ఆ తర్వాత థర్మామీటర్లో రీడింగు పెరగదు. అంటే నీటిని వేడిచేయడం ఆపేశామని అర్థంకాదు. థర్మామీటరు ఉష్ణోగ్రతనే కాని ఉష్ణాన్ని కొలిచే సాధనంకాదు. ఉష్ణోగ్రత వంద డిగ్రీలకు చేరుకున్నాక—నీటికి సరఫరా చేసిన ఉష్ణం నీటిలో గుప్తంగా వుండిపోతుంది. దాన్ని ఇంగ్లీషులో లేటెంట్ హీట్ అంటారు. ఈ గుప్తోష్ణంవల్లనే ఎక్కువసేపు మరిగిన నీరు ఆలస్యంగా చల్లారుతుంది."

తమ్ముడికి లేటెంట్ హీట్ గురించి చాలా కష్టపడి వివరించానుకానీ వాడిని ఒక సందేహం పట్టుకు పీడిస్తూనే వుంది. ఉష్ణంవల్ల నీటి ఉష్ణోగ్రత పెరుగుతోంది. బాగానే వుంది. కానీ అలా కొంతసేపే ఎందుకు జరగాలి? వందడిగ్రీలు దాటేకకూడా నీటి ఉష్ణోగ్రత ఎందుకు పెరగదు?

అందుకనేక కారణాలున్నాయనీ — ద్రవపదార్థాలన్నింటికీ కూడా లేటెంట్ హీట్ వుంటుందనీ, ఏ ద్రవపదార్థానికైనా మరిగేస్థాయి చేరుకున్నాక—మరి ఉష్ణోగ్రత పెరగదనీ—కొన్ని ఎనభై డిగ్రీలదగ్గర మరిగితే, మరికొన్ని మూడువందల డిగ్రీలవద్ద మసుగుతాయనీ చెప్పాను. ఇంకా పైక్లాసులోకి వెడితే ఆ వివరాలన్నీ అర్థమయేలా చెబుతారనికూడా చెప్పాను. వాడు అసంతృప్తిగా వెళ్ళిపోయాడు.

అసంతృప్తి వాడికే కాదు. నాకూ కలిగింది. సైన్సుకు సంబంధించినంతవరకూ ఈ విషయం పరిహాలేదు. కానీ మనిషికీ, మానవప్రవృత్తికీ, కూడా ఇటువంటిదే ఒక సమస్య ఉందని నాకు అనిపించింది. అదేమిటో ఆ క్షణంలో నాకు తెలియలేదు. కానీ ఏదో వుందనిమాత్రం స్ఫురించింది. ఎంత తన్నుకున్నా అదేమిటో తెలియలేదు. కానీ ఎందుకో రంగారావు మాత్రం గుర్తుకు వచ్చాడు

రంగారావు చాలా అమాయకంగా మాట్లాడుతాడు. కాని ఎంతో తెలివిగా మాట్లాడేననుకుంటాడు. అందువల్లనే నేనతన్ని అమాయకుల్లో జమవేశాను. అతనితో కొంతకాలం పరిచయం తర్వాత అతను నిజంగానే అమాయకుడని గ్రహించాను. ఎందుకంటే అతను నన్నొక అమాయకుడుగా లెక్కవేశాడు.

మానవ మనస్తత్వ పరిశీలన నాకు హాబీ. నాకు తెలిసినంతవరకూ రంగారావుది ప్రత్యేక

★ లేటెంటు హీటు (గుప్తోష్ణం) ద్రవపదార్థాల కుంటుందని సైన్సు చెబుతుంది. ఆ లేటెంట్ హీటు మానవ ప్రకృతికీ వుంటుందని (కామన్) సెన్సు చెబుతుంది. ★

మైన వ్యక్తిత్వమేమీకాదు అయినా నేనతనితో పరిచయం పెంపొందించుకున్నాను. నా అమాయకత్వాన్ని రంగారావానందిస్తాడు. అతనలా చేయడం నాకానందం. ఇదొక విచిత్ర తత్వం. ఇందులోని ఆనందం అనుభవంలోకి వస్తేకానితెలియదు. ఇంతకీ రంగారావు ఆఫీసులో నా కొలీగ్ అని చెప్పడం మరిచిపోయాను. ఆరునెల్లక్రితమే ట్రాన్స్‌ఫర్ మీద అతనీ ఊరు వచ్చాడు.

వచ్చినరోజున రంగారావు ఫుల్ సూట్లో వచ్చాడు. మేముండే ప్రాంతంలో ఎండలు జాస్తి. అప్పుడు వేసవికాలం కాకపోయినా ఎండలు బాగా కాస్తున్నాయి. మా ఆఫీసులో మొత్తం ఎనమండుగురం ఆఫీసర్లమున్నా—ఎవరూ ఆ రోజుల్లో ఫుల్ సూట్లో రాము. ఎందుకంటే—డ్రస్సుకి కంఫర్టు కూడా ముఖ్యం కదా!

తొమ్మిదో ఆఫీసరు రంగారావు ఫుల్ సూట్లో రాగానే అందరిమధ్యా అతనొక విచిత్రవ్యక్తిలా కనబడ్డాడు. అయిదారు గురతన్ని పలకరించి అతని సూటును ప్రత్యేకంగా కాంప్లిమెంట్ చేశారు. అందులోని వ్యంగ్యం తెలియని రంగారావు నా దగ్గరకు వచ్చి—"అంతా నా సూటు మెచ్చుకునేవారే. ఇక్కడ మంచి టైలర్స్ లేరా?" అనడిగాడు.

నేను నవ్వి—"ఇంత ఎండలో సూటు వేసుకువస్తే ఒళ్ళంతా చెమటలు కారిపోవు టండీ — అందరికీ మీకులాంటి ఎయిర్ కండిషన్డు సూట్లుంటాయా?" అన్నాడు.

"ఎయిర్ కండిషన్లు సూటేమిటండీ!" అన్నాడు రంగారావు.

"ఇంత ఎండలో ఈ పవర్ కట్ రోజుల్లో - మీరు సూట్ వేసుకువచ్చారంటే ఆ క్లాత్‌లో ఏదో స్పెషాలిటీ వుండి వుండాలి. ఈ మధ్య ఏదో ఎయిర్ కండిషన్డు క్లాత్ వచ్చిందని విన్నాను"

రంగారావుకు బాగా ఎక్కువగా నవ్వు వచ్చింది—"ఎంత అమాయకులండీ మీరు?" అని మళ్ళీ కాసేపు నవ్వాడు—"ఎయిర్ కండిషను క్లాతంటూ వున్నమాట నిజమే కానీ అది ఊరికే ఫ్యాషన్‌కు పెట్టినపేరు. నిజంగా ఎయిర్ కండిషన్ చేసే క్లాతేదీ ప్రపంచంలో కనిపెట్ట బడలేదు అయినానేను సూటెందుకు వేసుకొచ్చే నంటారా? ఆఫీసరన్నాక సూటువేసుకోలండీ—లేకపోతే బయటవాళ్ళకు మన పొజిషన్ తెలియదు. ఆఫీసులో కిందవాళ్ళు మనలను గౌరవించరు"


ఈ ధర్మ సూక్ష్మం వివరించిన రంగారావు నన్నమాయకుడిగా జమచేసిన క్షణం గ్రహించిన వారెవరికైనా అతనితో నేను త్వరత్వరగా పరిచయం పెంపొందించుకోవడానికి గల కారణం సులభంగా అర్ధమయుంటుంది.

మా పరిచయం వృద్ధిపొందిన కొద్ది రోజుల్లోనే రంగారావు నన్ను లోకజ్ఞానం లేనివాడుగా గుర్తించి జాలిపడ్డాడు. "ఎలా బ్రతుకుతారండీ మీరు—బొత్తిగా లోకజ్ఞానం లేదు—" అని నాతో ఎన్నోసార్లు అన్నాడు. తను మానవ మనస్తత్వాన్ని కాచి వడబోశాననీ—మానవ మనస్తత్వ పరిశీలన తనకు హాబీ అనీ ఎన్నోమార్లు నాకు చెప్పాడతను.

ఈ మధ్య ఇలాగనడం చాలామందికి ఫేషనైపోయింది—"నీకు తెలియదోయ్—నేను ప్రతిపాదిస్తే [illegible]—వాడి మనస్తత్వమెలాంటిదో తెలుసుకుంటాను" అనే స్నేహితులు కనీసం నాకో పాతిక మంది దాకా ఉన్నారు. వాళ్ళలో నేను విశ్వసించేది ఒక్క కామరాజుని మాత్రమే.

కామరాజు సామర్ధ్యంమీద నాకు చాలా నమ్మకముంది. అతని ఎనాలిసిస్ చాలా చక్కగా ఉంటుంది. అతను మాట్లాడేటప్పుడు వింటూంటే—అతను చెప్పేదంతా నిజమనిపిస్తుంది. ముఖ్యంగా అతను నాగురించి తన అభిప్రాయం చెప్పాడు—"నువ్వు చాలా తెలివైన వాడి ననుకుంటావు. అది నిజమే. అయినా అలా అనుకోవడం అంతమంచిది కాదు. మనసులో దురుద్దేశ్యమున్నా పైకి అమాయకంగా కనిపించడానికి ప్రయత్నించి సఫలీకృతుడవౌతావు. ఎవరితో మాట్లాడితే

వారి మాటలకు తందానతాన అంటూ అందరినీ మెప్పించి మంచిపేరు తెచ్చుకుంటావు. వాదించే శక్తి ఉన్నా ఎదుటివాడితో వాదనకు దిగవు. ఔననటంలోనే సుఖముందనీ, నష్టంలేదనీ అనుకుంటావు ” అంటూ ఎన్నో చెప్పాడు. అన్నీ కరెక్టే! నాకు తెలిసిన ఎంతోమంది గురించి కామరాజూ నేనూ చర్చించే వాళ్ళం- అనేక విషయాల్లో నా మనస్తత్వంవల్ల కాక, నిజంగానే నేను కామరాజుతో ఏకీభవించడం జరిగేది.



ఒకరోజు మా చర్చలలో ఇతరుల భార్యల ప్రసక్తి వచ్చింది.

“సుబ్బారావు భార్య—మనిషి మంచిదే. మనసూ మంచిదే—కానీ పరాయి మగవాడు కనబడేసరికి ఆకర్షణీయంగా కనబడాలని ప్రయత్నిస్తుంది. ఇలాగన్నానని మరోలా అనుకోకు. ఇది డెలికేట్ విషయమే అయినా హాబీ అవడం మూలాన నాకు వాళ్ళూ వీళ్ళూ, ఆ విషయం ఈ విషయం అంటూ లేకుండా అన్ని సందర్భాల్లోనూ మనుషులను పరిశీలించడం అలవాటు. రేపొద్దున్న నా భార్యను కూడా రకరకాల దృష్టిలో చూస్తాడా ఏమిటి- అని ఆలోచిస్తున్నావా? నాక్యూరియాసిటీ మనస్తత్వాలమీదనే కానీ మనుషులమీద కాదని నీకు తెలుసుగదా—ఇన్నెందుకు? నా అర్ధ శరీరంగా ఏంచబడే నా శ్రీమతిని కూడా నేను జాగ్రత్తగా పరిశీలిస్తూంటాను. ఆమె చేష్టలను ప్రేమ దృక్కులతో కాక—మనస్తత్వాన్ని అర్ధం చేసుకోవడం కోసం గమనిస్తాను. ఈ విధంగా నేను కొంత ఆనందానికి దూరమవుతున్నానని కూడా చెప్పవచ్చు. నా భార్యకు కూడా కాస్త ఇబ్బంది కలిగిస్తున్నాను. అయితే ఆమె అమాయకురాలు కావడంవల్ల ఏ ఇబ్బందీ లేకుండా పోయింది ” కామరాజు ఆగడానికి కారణం నా ముఖంలో ఆసక్తిని వెదకడానికేనని గ్రహించాను. వెధవది— నేనూ సైకాలజిస్టునే కదా!

“నువ్వు నమ్మతావో నమ్మవో కానీ—లక్ష్మి అంత అమాయకురాలు అసలు ఆడవాళ్ళలోనే ఉండరేమో ననిపిస్తూంటుంది. ఏ రహస్యమూ దాచలేదు. పట్టుమని ఒక్క- అబద్ధమైనా ఆడలేదు. చిన్న తప్పుచేస్తే భయపడిపోతుంది. నాకు కాస్త కోపంవస్తే హడిలిపోతుంది. నేనేం చెప్పినా ఆశ్చర్యంగా ఇంత కళ్ళు చేసుకుని వింటుంది. ఎప్పుడైనా తను రహస్యం దాచినా, అబద్ధమాడినా—నేనిట్టే

పట్టేస్తే—'ఎలా కనిపెట్టేశారండీ, మీ తెలివి తేటలు దేవుడు నాకిచ్చినా బాగుండును—" అంటుంది. ఆమెను చూస్తూంటే నాకు చాలా జాలికూడా కలుగుతూంటుంది. ఈ అమాయ కురాలు తన అదృష్టం కొద్దీ నా భార్య అయింది కానీ లేకపోతే అష్టకష్టాలూ పడి ఉండేది—

కామరాజు ఆగి నా ముఖం పరిశీలించాడు— "స్వంత డబ్బా వాయిస్తున్నాననుకోకు.నిజంగానే నేను ఆదర్శభర్తను " అన్నాడు. అని మళ్ళీ వాసు దేవరావు భార్యగురించి చెప్పడం ప్రారంభించాడు. కేవలం హాబీకోసమే అయినా—స్నేహితుల భార్యల నింత క్షుణ్ణంగా పరిశీలించడం—ఎంతవరకూ ఆదర్శభర్తల లక్షణం—అని ఆలోచిస్తూంటే చిన్న విషయం నాకు స్ఫురించింది. కామరాజు భార్య గురించి నేను కూడా బోలెడు ఆలోచించాను. కామరాజు చెప్పినవన్నీ నిజం. ఆమె నిజంగానే చాలా చాలా అమాయకురాలు. వాళ్ళిద్దరి సంసారం చూస్తూంటే ఎన్నోసార్లు నాకూ అటువంటి భార్య దొరికితే బాగుండుననిపించేది. ఆడవాళ్ళ ముఖం అందంగా ఉంటే—అమాయకత్వం ఆ అందాన్ని రెట్టింపు చేస్తుంది. అందుకే నేను స్నేహలత గురించి తరచుగా ఆలోచించ వలసి వస్తోంది.

స్నేహలతని నేను లతా అని మాత్రమే పిలుస్తాను. ఆమె నాకు స్వయానా మరదలు. మనిషి చాలా అందంగా ఉంటుంది. చదువు కుంటోంది. పుట్టినప్పట్నించీ నా భార్యగా వ్యవ హరించబడుతోంది. అందువల్లనే కాస్త వయసు వచ్చినప్పట్నించీ నేనామెను ఆ దృష్టి తోనే వీక్షించేవాణ్ణి. స్నేహలత ఇప్పుడు బియ్యే ఫైనలియర్ చదువుతోంది. పరీక్షలు కాగానే మా ఇద్దరికీ ముడిపెట్టేయాలని స్నేహలత తలిదండ్రులు అనుకుంటున్నారు. అయితే మా అమ్మ దృష్టి వేరే ఉంది. లతా వాళ్ళు కట్నమివ్వలేరు. కట్నాల బజార్లో నాకు పదిహేనునించి ఇరవైవేల దాకా ధర ఉంది. ఇంత విలువైన వస్తువును లతకు కారుచవగ్గా అమ్మడం అమ్మ కిష్టంలేదు. కానీ ఈ విషయంలో నాన్నగారి పట్టుదల ఉంది. అందువల్ల తరచుగా మా ఇంట్లో చిన్న సైజు తుఫానులాంటిది రేగుతోంది.

నాకు సంబంధించినంతవరకూ లత విష యంలో ఒక చిన్న ఇబ్బంది ఉంది. ఒకానొక ఉద్రిక్త పరిస్థితిలో—ఒక సంవత్సరం క్రితం లతా నేనూ ఏకమయ్యాం. ఇద్దరికీ వయసు ఉంది. వరస ఉంది. పెద్దల ఆశీర్వాదం త్వరలో రానున్నదన్న నమ్మడం లత కుంది. మొత్తంమీద ఆమెను నేను లోబర్చుకో గలి గాను. ఉద్రేకం చల్లారేక నాకు భయంవేసింది. ఆమె ఏడ్చింది. ఆ క్షణంలో కలిగిన జాలిలో ఆమెకు నేను వాగ్దానంచేశాను—ఆమెను తప్ప మరెవ్వరినీ వివాహమాడనని! ఆ తర్వాత లత నాకు అందలేదు. జరిగిన పొరబాటేదో జరిగి పోయింది. మరి వివాహమయ్యేవరకూ తనను తాకరాదని చెప్పింది. దేవుడు చల్లగా చూడడం వల్ల—నేను చేసిన పొరపాటు మరే విపత్కర పరిస్థితులకూ దారితీయలేదు.

ఇప్పుడింతకూ నా ఇబ్బంది ఏమిటంటే— ఇటీవలే నాకు డబ్బుమీద మోజు కలుగుతోంది. కట్నం తీసుకుని వేరే ఎవరినైనా అమ్మాయిని పెళ్ళి చేసుకోవడంలో తప్పులేదని నాకు అని పిస్తోంది. నాన్నగారికి, అమ్మకూ [illegible] అంచేత [illegible] అమ్మ [illegible] మాత్రం [illegible]డిలా ఊదుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ—తొందరపడి నేను చేసిన పొరపాటువల్ల —లతపట్ల నాకూ కొంత బాధ్యత ఉన్నదని— నాలోని మనిషి చెబుతున్నాడు. అయితే ఆ పొరపాటులో లత బాధ్యతకూడా లేకపోలేదనీ, జరిగిన పొరపాటు దుష్ఫలితాలకు దారితీయ లేదు కాబట్టి ఎవరికీ నష్టం లేదనీ—ఈ కార ణంగా లతపట్ల నాకు బాధ్యత ఏమీలేదనీ— నాలోని మనిషి కానివాడు చెబుతున్నాడు. వీళ్ళి ద్దరి అంతర్యుద్ధం నాలో కొనసాగుతూన్న క్షణంలో కామరాజు భార్య అమాయకత్వాన్ని నేను ఇష్టపడడం జరిగింది. నా భార్యకూడా అమాయకురాలైతే బాగుండు ననిపించింది.

# రచయిత గురించి



పేరు జొన్నలగడ్డ రాజగోపాలరావు. చదువు కెమిస్ట్రీలో డాక్టరేట్ పట్టం. ఉద్యోగం భువనేశ్వర్లోని రీజినల్ రీసెర్చి లాబరేటరీలో సైంటిస్టు. భార్య జొన్నలగడ్డ రామలక్ష్మి. కలం పేరు మా భార్యాభర్తలిద్దరికీ చెందుతుంది. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలోనూ మా రచనలు ప్రచురింపబడి, బడుతున్నాయి. క్రైమ్ కథలు, పిల్లల కథలు కూడా వ్రాస్తూంటాము. నేను 1963లోనూ, శ్రీమతి 1974 లోనూ రచనలు చేయడం ఆరంభమయింది. రచనలు చేయడానికి మాకున్న అతి స్వల్ప వ్యవధి కారణంగా, ఎక్కువగా పోటీ సమయాల్లోనే రచనలు చేస్తూంటాము. పోటీలు పెట్టి రచయితలను ప్రోత్సహిస్తున్న పత్రికలన్నీ అభినందించ బడాలి. ఇంత వరకూ నా రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వారపత్రికలలో బహుమతులు పొందాయి. ఇటీవల "నీలిమ" పత్రికలో మా.దంపతుల వివరాలు ప్రచురించబడ్డాయి. మా రచనలను ఆదరించి వాటికి"గుర్తింపు" లభింపజేస్తున్న 'జ్యోతి' మాసపత్రికకు మేమెంతగానో ఋణపడి ఉన్నాము. పాఠకులందరకూ పత్రికాముఖంగా శుభాకాంక్ష లందజేయడానికి ఈ అవకాశం తీసుకుంటున్నాము. శుభాకాంక్షలతో....

—"వసుంధర"

---

అయితే స్నేహలత అమాయకురాలు కాదు మరి!

ఎన్నో విషయాలు నేను కామరాజుతో చెప్పి ఉన్నాను కానీ స్నేహలత సంగతి మాత్రం చెప్పలేను. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే సామర్థ్యంగల అతని దగ్గర నేను కాస్త జాగ్రత్తగా ఉండడం—ఎంతో అవసరం.

కామరాజు వివాహం సరిగ్గా ఎనిమిది నెలల క్రితం జరిగింది. అతని పెళ్ళికి నేను వెళ్ళాను. ఆ పెళ్ళి వేడుకలూ అవీ చూస్తూంటే నిజం చెప్పొద్దు—నాకూ వివాహం చేసుకోవాలని పించింది. మంచి ఉద్యోగం, యౌవనం—రెండూ ఉన్నాయి. మరి వివాహానికి అడ్డేముంది? నాన్నగారి దృష్టిలో లత బియ్యే పూర్తి చేయాలి. అమ్మ దృష్టిలో—నాన్నగారి మనసు మార్చాలి. వీళ్ళద్దరి అంతర్యుద్ధం అంతమయ్యే దాకా నేను వేచి ఉండాలి. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి.

ఇటువంటి పరిస్థితులలోనే మనిషిని ఒంటరితనం దిగజారుస్తుంది. అందుకే నేను మంచి స్నేహితులకోసం అన్వేషణలో ఉన్నాను. ఏ అన్వేషణా లేకుండానే అనుకోకుండా రంగారావు నాకు తగిలాడు. ఇద్దరం మంచి స్నేహితులమయ్యాం.

తమ్ముడికి లేటెంటుహీటు గురించి చెబుతూంటే హఠాత్తుగా నాకు రంగారావు గుర్తుకు వచ్చాడు. లేటెంటుహీటు గురించీ, రంగారావు గురించీ చాలాసేపు ఆలోచించాను. ఆఖరికి మర్నాడు కామరాజుతో ఈ విషయం చర్చించాలనుకున్నాను కానీ అలా చేయలేదు. అసలు రంగారావుని కామరాజుకోసారి పరిచయంచేసి—అతని ఎనాలిసిస్ ఏమిటో తెలుసుకోవాలను

కున్నాను. అంతవరకూ అనేక పర్యాయాలు రంగారావు గురించి కామరాజుతోచెప్పి ఉన్నాను. కానీ ఇద్దరినీ ఒకరి కొకరిని పరిచయం చేయ లేదు. ఇప్పుడు కామరాజు భార్య పుట్టింట్లో ఉంది కాబట్టి——మేము కలుసుకోవడాని కింతకంటె మంచి సమయ మింకొకటుండదు.

మర్నాడు సాయంత్రం రంగారావుని తీసు కుని కామరాజు ఇంటికి వెళ్ళాను. రంగారావును పరిచయంచేయగానేకామరాజు ముఖం దివ్యంగా వెలిగిపోయింది. రంగారావు మన సత్వం గురించి ఇక్కణ్ణించి కనీసం కొన్ని రోజుల వరకునైనా నాకు బోరుకొట్టవచ్చునన్న ఆనం దమే ఆ వెలుగుకు కారణమని నాకు తెలుసు.

సంభాషణ చాలా మామూలుగా నడుస్తూన్న ప్పటికీ——కామరాజు ప్రశ్నల వెనుక ఉన్న గూఢార్థాన్నీ, కుతూహలాన్నీ నేను బాగా అర్థం చేసుకోగలను.

"మంచి ఉద్యోగంలో ఉన్నారు గదా—— ఇంకా వివాహం చేసుకోలేదేం?" అన్నాడు కామరాజు యథాలాపంగా అడిగినట్లు.

"చిన్న ప్రేమ వ్యవహారముంది. అందుకే కొంచెం ఆలశ్యమవుతోంది——" అన్నాడు రంగారావు తాపీగా.

నాకు నిజంగానే ఆశ్చర్యం కలిగింది. రంగారావులాంటి భోళామనిషి ఇంతవరకూ నాకింత ముఖ్యమైన విషయం చెప్పకుండా ఎలా వుండగలిగాడు? అదే——అడిగేశానుకూడా—— "మీరు నన్ను అడగలేదు. నేను చెప్పలేదు" అన్నాడు రంగారావు మామూలుగా.

తర్వాత సంభాషణ మారింది. ప్రేమలోంచి ప్రేమకథలమీదకీ, సినిమాల్లో ప్రేమగురించీ, ఆ తర్వాత సినిమాలగురించీ, సినిమా నిర్మాతల గురించీ, ఒకప్పుడు బ్రహ్మాండంగా వెలిగి ఇప్పుడు పేదరికంలోవున్న కొందరు నిర్మాతల గురించీ చర్చలు జరిగాక——పేదరికం, బిచ్చ గాళ్ళగురించి చర్చ జరిగింది. ఆ చర్చలో కామ రాజు ఇంచుమించు శ్రోత. రంగారావు తన అభిప్రాయాలు చెబుతూంటే అతను ఆశ్చర్యంగా వింటున్నాడు.


కామరాజు దగ్గర్నుంచి ఈ లక్షణమొక్కటీ నేను కోరి అలవర్చుకున్నాను. ఎదుటి వ్యక్తుల గురించి అర్థం చేసుకోవాలనుకున్నప్పుడతను - కొన్ని టాపిక్సు కదిపి ఊరుకుంటాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతుంటే అతని అభిప్రాయాల నభినందిస్తూ మాటలందిస్తాడు. ఎంతో గౌరవ భావంతో అతనివంక చూస్తాడు. ఆ మాటలూ, ఆ చూపులూ ఎదుటివాడి నాకాశానికెత్తేస్తాయి. తన అభిప్రాయాలను ఏకధాటిగ చెప్పేయడం ప్రారంభిస్తాడు. ఇప్పుడు రంగారావు అదే చేస్తున్నాడు. ఒకప్పుడు ఇదే పరిస్థితుల్లో నేన యితే——మధ్యలో అతన్ని ఖండిస్తూ నా అభి ప్రాయాలు చెప్పకుండా ఉండలేకపోయేవాడిని. ఈనా బలహీనతను కామరాజు ఎత్తి చెప్పే వరకూ నేను గ్రహించనేలేదు.

మేము తిరిగి వెళ్ళేటప్పుడు రంగారావు అన్నాడు——"మీ స్నేహితుడు నాకు బాగా నచ్చాడండీ——అతని టేస్టులన్నీకూడా చాలా మంచివి. ఈ రోజు మాట్లాడుతున్నంతసేపూ అతని టేస్టులు తెలుసుకోవడానికే ప్రయత్నిం చాను"

తనను కామరాజు స్టడీ చేస్తున్నాడన్న విషయం రంగారావుకు తెలియదు. కామరాజు తన్నుగురించి పూర్తిగా అర్థం చేసుకునే కొద్దీ తను మాట్లాడుతున్న విషయం రంగారావుకు స్ఫురించనైనా లేదు. పైగా తన మాటలు కామ రాజుని అర్థంచేసుకుందుకు అలా మాటలాడు తున్నానని అనుకున్నాడు. ప్రతి వ్యక్తికీ ఎంత ఆత్మాభిమానం? ప్రతి వ్యక్తికీనూ ఎంత ఆత్మ వంచన?

నేను ఇంటికి వెళ్ళిపోయాను కానీ రంగా రావు గురించే ఆలోచిస్తున్నాను. అతనిప్పుడు కామరాజువీ తనవీ ఒకటే అభిప్రాయాలనే దృష్టిలో వున్నాడు. కామరాజుని తను బాగా స్టడీ చేశాననుకుంటున్నాడు. అయితే కామరాజు గురించి తను వేసుకున్న అంచనాలన్నీ తప్పని గ్రహించలేదు. దీనికీ లేటెంట్ హీట్‌కీ సంబంధం ఉంది. ఏమిటది?

తలకాయ నొప్పి వచ్చింది చెప్పితే ప్రయో




జనం లేకపోయింది. ఇంట్లో నాన్నగారికీ, అమ్మకూ మధ్య మళ్ళీ యుద్ధం జరిగింది. వాతావరణం బాగోలేదు. అమ్మ రహస్యంగా నా దగ్గరకు వచ్చి—నాన్నగారి మాటలు విన వద్దనీ—లతను పెళ్ళిచేసుకోనని ఆయనతో చెప్పేయమనీ చెప్పింది. కన్నతల్లికంటె నీ మేలు కోరేవారెవరుంటారు, ప్రాజ్ఞుడివయ్యావు- నిన్నుకాదని నాన్నగారు మాత్రం ఈ వివాహ మెలా చేస్తారని సవాల్ చేసింది. అయితే నేను ప్రాజ్ఞుడి నయ్యానని గుర్తించిన అమ్మ—నేను లతనుపెళ్ళి చేసుకోనంటే — ఏడిశావ్ కుర్ర కుంకవి అంటుంది—నన్నుకాదనడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తుంది.

నాలోని పరిశీలకుడు అనుక్షణం పనిచేస్తూనే వుంటాడు. ప్రతి మనిషిలోనూ వున్న ఆత్మాభి మానాన్నీ, స్వార్థపరత్వాన్నీ ఎత్తి చూపిస్తూం టాడు. ఆ సందర్భంలోనే నాలో వున్న స్వార్థం కూడా నేను గుర్తించడం జరుగుతుంది. అప్పుడు లత నాకు రాసిన ఉత్తరం నా కళ్ళముందు మెదుల్తుంది. ఆ వుత్తరం కళ్ళముందు మెదల గానే ప్రక్కన లత ప్రత్యక్షమవుతుంది. ఆ ఉత్తరాన్నీ, లతనూ విడిగా ఇంతవరకూ నా ఆలోచనల్లోకి తీసుకు రాలేకపోయాను.

లత ఉత్తరంలో తన ప్రేమనంతా వ్యక్తం చేసింది. ఆ ప్రేమలోనే ఎంతో బాధ వుంది.

"బావా! బలహీన క్షణాల్లో నీకు లొంగి పోయాను. అందుకు నేను ఏమాత్రమూ విచా రించడం లేదు. ఎందుకంటే మానసికంగా ఏనాడో నీ భార్యనై పోయాను. కానీ మనకింకా పెద్దల ఆశీర్వాదం లభించలేదు. అందుకే నీ హక్కును నీవు రహస్యంగా అనుభవించాల్సి వచ్చింది. నీమీద నాకెంత ప్రేమ వుందో తెలుసుకోవడానికి నీకు నేను కల్పించిన ఈ అవకాశమే సాక్షి! సాధారణంగా ఏ ఆడదీ ఇంత సాహసానికి ఒడిగట్టదు. ఎందుకంటే ఆడదాని దగ్గర ఏ రహస్యమూ దాగదు. ఎంత దారుణ మైన రహస్యమైనా ఎవరికో ఒకరికి చెప్పకుండా ఆడది వుండలేదు. దానికి తగ్గట్టే ప్రకృతికూడా ఆడదానిదగ్గిర రహస్యం దాగనివ్వదు. మగ వాడూ, ఆడదీ కలిసి చేసిన తప్పు—ఆడదాని పరంగా బయటపడుతుంది. ఇలా రెండు విధా లుగా రహస్యం దాచలేక ఆడది—నేను ఒడి గట్టిన సాహసానికి పూనుకోదు. కానీ నీమీద ప్రేమకొద్దీ నేనందుకు పూనుకొన్నాను. నీకు

నేను బలహీన క్షణంలో లొంగి వుండవచ్చు. కానీ నీకు కాబట్టే లొంగిపోయాను. అంతేకాదు-నా ప్రేమ నీకింకా వివరంగా అర్థమయేలా చేస్తాను — మన వివాహమయ్యేక! నన్ను వివాహం చేసుకున్న అదృష్టానికి నువ్వు అను క్షణం పులకించేలా చేస్తాను. నా ప్రేమ గురించి వర్ణించలేను. అనుభవంలో నువ్వే తెలుసు కుంటావు "

చాలా పెద్ద ఉత్తరం రాసింది లత. ఉత్తరం చదువుతూంటే లత నా కళ్ళముందు నిలబడి మాట్లాడుతున్నట్టే అనిపిస్తుంది. ఎన్నో వివ రాలు రాసిందందులో. ఆ ఉత్తరం చదువుకుని ఏ మగవాడైనా గర్వపడాలి. కానీ నేను గర్వ పడ్డంలేదు. భయపడుతున్నాను. నా దగ్గర అంత చొరవచేసిన, నాకు సులభంగా లొంగిపోయిన లతమీద ఏమూలో అనుమానముంది నాలో. దొరికేదాకా నానా అవస్థలూ పడి—చేతికి దొరి కాక అనుమానించడం మగబుద్ధిలోని విపరీత మేమో నేను చెప్పలేనుగానీ ఆ రోజునించీ క్రమక్రమంగా—లతనుతప్ప వేరొకరిని వివాహ మాడరాదన్న నా ఇదివరకటి నిర్ణయంలో బలం తగ్గసాగింది.

అయితే లత ఉత్తరం నేను మరువలేనిది. దాన్ని మరువలేనంతకాలం లతనుకూడా మరువ లేను. లత చాలా తెలివైనది. తన ఉత్తరం నామీద చూపగల ప్రభావం తెలిసుండే—ఈపని చేసింది.

అందుకే నా వివాహ సమస్య అమ్మా, నాన్నలకు వదిలేశాను. వాళ్ళెంత గుద్దుతున్నా నేను వహించేది మౌనమే.ఇద్దరి అభిప్రాయమూ ఒకటయ్యేవరకూ నా వివాహం ప్రసక్తిలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు కామరాజుకీ రంగారావుకీ చాలా మంచి స్నేహం కుదిరింది. రంగారావు ప్రతిరోజూ కామరాజు ఇంటికి వెడుతున్నాడు. ఇద్దరూ ఎన్నో విష యాలమీద చర్చలు జరిపేస్తున్నారు. ఒకరి మనస్తత్వాన్ని మరొకరు క్షుణ్ణంగా పరిశీలిస్తు న్నట్లుగా భావిస్తున్నారు! వీళ్ళిద్దరి సంభాషణలూ నాకు కలిగించే వినోదమింతా అంతా కాదు. అందుకే వాళ్ళిద్దరూ సంభాషిస్తున్నప్పుడు నేను శ్రోతగా మిగిలిపోతూ వచ్చాను.

ఇప్పుడు రంగారావుతో చర్చించే విధానం మార్చాడు కామరాజు. అతని అభిప్రాయాలతో ఏకీభవిస్తూనే తన అభిప్రాయాలనుకూడా కొద్ది కొద్దిగా చెబుతున్నాడు. రంగారావు సుముఖంగా కనబడితే మరికాస్త చెబుతున్నాడు. విముఖంగా కనబడితే టాపిక్ మారుస్తున్నాడు. ఈ విధంగా తను రంగారావుకి బోరుకొట్టకుండా వుండటమే కాక తనకు రంగారావు బోరుకొట్టకుండాకూడా చూసుకున్నాడు కామరాజు.

ఒకరోజు ఇద్దరూ ఆడవాళ్ళ మనస్తత్వాల గురించి చర్చిస్తున్నారు.

"స్వతహాగా ఆడదానికి తెలివి తేటలు తక్కువ. ఏ ఆడదాన్నయినా మంచి మాటలతో ఇట్టే మోసం చేయవచ్చు. తనకు జరిగే నష్టం తెలిసుండీ ఆడది మగవాడికి లొంగిపోతుంది. ఎందుకంటే ఆడదీ గుడ్డిగా కొన్ని విషయాలు నమ్ముతుంది. ఆ నమ్మకం వల్లనే ఆమె ప్రేమమూర్తిగా విలసిల్లగలుగుతోంది " అన్నాడు రంగారావు.

"మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభ విస్తున్నాను కానీ ఆమె ప్రేమమూర్తి కావడా నికి నమ్మకంకాదు కారణం. అమాయకత్వం. మీరు చెప్పే నమ్మకంకూడా అమాయకత్వం వల్ల కలిగినదే—అసలు ప్రేమ అన్న పదం అమాయకులకోసం సృష్టింపబడింది చెప్పితే - దాని కర్థమేముంటుంది-" అన్నాడు కామరాజు.

"మీరు చెప్పిందీ నిజమే ననిపిస్తోంది "

"అనుభవంమీద చెబుతున్నానుగదా—ఉదా హరణకు నా భార్యను తీసుకోండి. అమాయ కత్వానికి ఆమెను చెప్పి వేరెవరినైనా చెప్పాలి. తన ప్రాణంమీదకు వచ్చే రహస్యాన్నికూడా దాచలేదు .. "

హఠాత్తుగా లత గుర్తుకువచ్చింది నాకు. ఆడవాళ్ళు రహస్యాలు దాచలేరంటారు. మే మిద్దరం కలుసుకున్న సంగతి రహస్యంగా వుంచడం తనకు ఇబ్బంది అన్నట్లుగా ఆమె ఉత్తరంలో రాయనే రాసింది.

"నిజంగానే ఆడవాళ్ళు రహశ్యం దాచలే రంటావా?" అనడిగాను కామరాజుని.

"ఆహా-నా ఎరికలో కనీసం వందమందైనా వున్నారు. మా ఆవిడ వాళ్ళలో ఒకర్తి మాత్రమే!"

"ఉదాహరణకు-వివాహం చేసుకుంటావన్న నమ్మకంలో ఓ ఆడది నీకు లొంగిపోయిం దనుకో—వివాహమయ్యేవరకూ ఆమె పరిస్థితి ఎలాగుంటుంది? రహశ్యం దాచగలదా?"

కామరాజు నావంక అనుమానంగా అదోలా చూసి — "రహశ్యం దాచక ఏం చేస్తుంది? తప్పనిసరిగామరి-అందువల్ల విషయం రహశ్యంగానేవుంచుతుంది. కానీ ఆమె—వివాహమయ్యేవరకూ భయం భయంగా నీరసంగా రోజులు గడుపుతుంది. మళ్ళీ తన నెవరనుమానిస్తున్నారో నన్న అనుమానంతో మేకపోతు గాంభీర్యాన్ని నటిస్తుంది. ఆ నరకం అనుభవించేవాళ్ళకేగానీ తెలియదు "

నాకు గట్టిదెబ్బే తగిలింది. ముఖంలోకి ఏ భావమూ రాకుండా ఉండేలా జాగ్రత్తపడ్డాను. కామరాజుకి నామీద ఈపాటికే ఏదో అనుమానం వచ్చి వుంటుంది. యథాలాపంగా అడిగినట్లు అడిగాను - "కర్మంజాలక ఆమెకు మరొకరితో వివాహమైందనుకో ?"

"ఆ ఆడకూతురు అనుభవించే నరకయాతన మగవాడికికూడా రాకూడదు. భౌతిక సమస్యల కంటె—మానసిక వ్యథలే మనిషిని ఎక్కువగా బాధపెడతాయి " అన్నాడు కామరాజు.

"చాలా బాగా చెప్పారు. అందుకే మనసున్న మగవాడెవ్వడూ ఆడదాన్ని మోసం చెయ్యకూడదన్నది నా అభిప్రాయం " అన్నాడు రంగారావు. అతనా మాటలను చాలా ఖచ్చితంగా అన్నాడు. నా మటుక్కు నాకు ఆ మాటలు నన్నుద్దేశించి అన్నట్లనిపించినా రంగారావుకి అతకు నాకూ గల సంబంధం గురించి తెలియదుగదా అని సరిపెట్టుకున్నాను.

ఇంటికి వెడుతున్నప్పుడు రంగారావు నాతో అన్నాడు—"నేను మిమ్మల్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. ఇందాకా మీరు కామరాజుగారి నడిగిన ప్రశ్నల వెనుక ఏదో కథ ఉంది. అదేమిటో నేను తెలుసుకోవచ్చా?"


నేను ఇబ్బంగా నవ్వి—"అబ్బే అలాంటిదేమీలేదు " అన్నాను.

"లేకపోతే ఫరవాలేదుకానీ ఎప్పుడూ ఆడదానికి అన్యాయం తలపెట్టకండి "

"నేనటువంటివాడిని కాదుకానీ మీరీ విషయంలో చాలా ఖచ్చితమైన అభిప్రాయంలో వున్నారు. అడుగుతున్నానని మరోలా అనుకోకండి—స్వానుభవమా?" నా మనసులో ఉన్న కసి ప్రశ్నలో చోటుచేసుకో గలిగింది.

అయితే నేను ఆశ్చర్యపోయేలా-"అవును!" అన్నాడు రంగారావు.

## (వి)చిత్ర విజ్ఞానం



ఆఫ్రికాలోని "పాపిలో యాంటిమాకస్" అనబడే సీతాకోకచిలుక రెక్కల పొడవు సుమారు పది అంగుళాలు. ఇది సీతాకోకచిలుకల కల్లా చాలా పెద్దది. దీని వంటినిండా విషమే. ఈ విషంతో ఆరు పిల్లులను చంపవచ్చునని, సీతాకోకచిలుకల నిపుణుడు డా॥ గూడెన్ అంటున్నారు. ఇంగ్లాండులోని డార్సెట్ లో వీరు ఒక పెద్ద సీతాకోక చిలుకల "ఫారమ్" నెలకొల్పారు!

"తెలుసుకోవచ్చా—అదేమిటో?"

"తెలుసుకోవడాని కిందులో ఏమీ లేదు. మగవాడికి తొందరెక్కువ. ఆడదానికి మగవాడి మీద విశ్వాస మెక్కువ. రెండూ నా జీవితంలో జరిగాయి ."

రంగారావుకూడా నాకులాగే తొందరపడ్డాడని అర్థమైంది — "ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నారా?"

"లేదు. కానీ ఆమె వివాహం జరిగిపోయింది " అంటూ అదోలా నవ్వాడు రంగారావు. ఆ నవ్వు చాలా విషాదంగా వుంది.

"కామరాజు ఎటువంటివాడినైనా గంటలో అర్థం చేసుకోగలడు. కానీ అతను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకున్నాడనిపించదు " అన్నాను. అలాఅనడం ద్వారా అతనికథ అతని చేతనే మరికొంచెం చెప్పించగలననిపించింది.

కానీ అతనూ లొంగలేదు — "కామరాజుగారా? ఆయన కేవలం ధర్మామీటరులాంటివారు" అన్నాడు రంగారావు.

"ఊఁ" అని ఉలిక్కిపడ్డాను—"అంటే?"

రంగారావు ముఖం బాధగా అయిపోయింది- "నేను ప్రేమించి పెళ్ళిచేసుకుందా మనుకున్న లక్ష్మి కొన్ని విచిత్ర పరిస్థితిల్లో నన్నపార్థం చేసుకుని నాకు దూరమై ఇప్పుడు శ్రీమతి కామరాజు అయింది. పవిత్రతకు మనపూర్వీకులిచ్చిన తప్పు నిర్వచనాన్ని నమ్మి తానపవిత్రురాలనని భావిస్తోందామె. లక్ష్మి జీవితంలో ఏపనైనా చేయగలదుకానీ రహస్యాన్ని దాచలేదని నాకు తెలుసు. అందుకే ఇప్పుడామెలోనున్న ఏకైక రహస్యం ఉష్ణంలా ఆమెను కాలుస్తూంటే—ఆమె తెలివి తేటలు మరిగి ఆవిరైపోయాయి. ఎంతో తెలివైన లక్ష్మి ఒక చిన్న రహస్యం గురించి శుద్ధ అమాయకురాలుగా మిగిలిపోయింది. కామరాజుగారు ఆమె అమాయకత్వాన్ని మాత్రమే కొలవగలుగుతున్నారు. మరిగే నీటికి ఎంత ఉష్ణాన్ని సరఫరా చేసినా నీటి ఉష్ణోగ్రత పెరగదు. నా రాక, నా సమక్షం—లక్ష్మికి ఉష్ణంతో సమానం. ఆ వుష్ణాన్నామె భరించినా కామరాజది తెలుసుకోలేడు. అతను ధర్మామీటరు లాంటిమీవాడు కాబట్టి! ఒకవిధంగా చెప్పాలంటే స్త్రీ నీటి వంటిది. ఆమెలో ఎన్నో రహస్యాలు దాగివుంటాయి. మగవాడికొకటీ ఆడదానికొకటీ న్యాయమున్న ఈ సమాజంలో—పురుషుడు ధర్మామీటరులా వుండడమే స్త్రీకి వరం!"

రంగారావు మాటలకు ఆశ్చర్యపడ్డాననడం కంటె షాక్‌తిన్నాననడం మేలు! నా మనసులో చాలాకాలంగా పీడిస్తూన్న ప్రశ్నకు జవాబు దొరకడంతో పాటు రంగారావును తప్పు అంచనా వేసిన నా తెలివి తక్కువతనంకూడా తెలుసుకోగలిగి—"మీరు సామాన్యులు కారు రంగారావుగారూ—" అన్నాను అభినందన పూర్వకంగా.

రంగారావు ముఖం వెలిగింది—"ఇందులో పెద్ద విశేషమేమీలేదు. మానవమనస్తత్వాలను పరిశీలించడం నాకు హాబీ—" అన్నాడు.

ఇద్దరం విడిపోయాక బాగా ఆలోచించాను నేను. లక్ష్మికి వచ్చిన ఇబ్బంది లతకు రాకూడదు. నా పెళ్ళి విషయంలో నేనే నిర్ణయం తీసుకోవాలి.

మర్నాడు ధైర్యంగా తలిదండ్రులకు నా వివాహ విషయంలో నిర్ణయం చెప్పేసరికి వాళ్ళు ముందుగా ఆశ్చర్యపోయినా, తర్వాత కాసేపు గొడవ జరిగినా, చివరకు నామాట కంగీకరించారు.

నా అర్థాంగి అయినాక కూడా లతఅమాయకురాలు కానవసరంలేకపోయింది. అందుకు నేను గర్వపడ్డప్పటికీ — కామరాజు భార్య లక్ష్మిని చూసినప్పుడల్లా నా మనసు కలుక్కుమంటూ ఉంటుంది.

పవిత్రతను కేవలం ఆడదానికే పరిమితం చేసిన ఈ సమాజంలో, నాలాంటి మగవాళ్ళెందరో వున్న ఈ సమాజంలో—ఆడది తన ఏ రహస్యాన్నయినా నిర్భయంగా బయటకు చెప్పుకునే రోజు ఎన్నటికైనా వస్తుందా?

ఆ రోజు వచ్చేవరకూ ఆడదానికి లేటెంట్ హీట్ బాధ తప్పదు. మగవాడు ధర్మామీటరుగా ఉండగలగడమొక్కటే ఆమెకు వరం! □